క్లుప్తంగా

బస్సు యాత్రను జయప్రదం చేద్దాం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు (రాజ్‌విహార్) : నగరంలో ఆదివారం నిర్వహించే వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రను సమష్టిగా జయప్రదం చేయాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక గిప్సన్ కాలనీలోని తన నివాసంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సాధికార బస్సు యాత్రను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో పాతబస్తీలో ఆదివారం సాయంత్రం జరిగే యాత్రను జయప్రదం చేసేందుకు కార్యకర్తలు తమతో పాటు వార్డు ప్రజలను తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో కేడీసీసీ చైర్‌పర్సన్ విజయ మనోహరి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటరు జాబితాను సమగ్రంగా విచారించాలి



ఓటరు జాబితా సవరణపై సమీక్షిస్తున్న ఏపీసీ

కృష్ణగిరి: ఓటరు జాబితా సమగ్రంగా విచారించి సవరణ పక్కాగా చేపట్టాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి, ఎస్ఎస్ఏ అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్ సూచించారు. శనివారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజేశ్వరి, బీఎల్‌ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏపీసీ మాట్లాడుతూ ఒకే వ్యక్తికి రెండు, మూడు ఓట్లు ఉంటే ఓటరు అభిప్రాయం మేరకు ఒకే ప్రాంతంలో ఉంచి మిగతా చోట్ల తొలగించాలన్నారు. ఓటరు నమోదు, సవరణ దరఖాస్తులను విచారించి ఎన్నికల అధికారులకు నివేదించాలన్నారు. అనంతరం ఆయన మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని, మెయిన్ స్కూల్‌ను తనిఖీ చేశారు. దివ్యాంగులతో ముచ్చటించారు. చాక్లెట్లు పంచారు. మెయిన్ స్కూల్ రికార్డులు, హాజరు పరిశీలించారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

కర్నూలు(హాస్పిటల్): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మెడికవర్ హాస్పిటల్ వారు రూపొందించిన క్యాలెండర్‌ను జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో హాస్పిటల్ క్లస్టర్ హెడ్ మహేశ్వరరెడ్డి, సెంటర్ నీలారెడ్డి, మార్కెటింగ్ హెడ్ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్‌కు నివాళి

కర్నూలు(రాజ్‌విహార్): వైఎస్‌ఆర్‌సీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శిగా నియమితులైన ఇందిరాగాంధీ నగర్‌కు చెందిన కురువ మల్లికార్జున, పార్టీ కార్యకర్తలతో కలిసి శనివారం మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సాక్షి సినిమాలు



ఎస్వీసీ కాంప్లెక్స్ : ఎనిమల్, హాయ్ నాన్న, ఎక్‌స్ట్రా ఆర్డినరీ మ్యాన్
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : పిండం, ఎనిమల్, హాయ్ నాన్న, ఎక్‌స్ట్రా ఆర్డినరీ మ్యాన్, జోరుగా హుషారుగా, తికమక తాండ
వెంకటేష్ సినీ కాంప్లెక్స్:ఎనిమల్, హాయ్ నాన్న
ఐనాక్స్ : తికమక తాండ, కలశ : సింబల్ ఆఫ్ అబున్‌డెన్స్, హాయ్ నాన్న
శ్రీరామ : దశారి, చే – లాంగ్ లీవ్
రాజ్ : పిండం విజయ : ఎనిమల్

ఆడపిల్లల నిష్పత్తి తగ్గకుండా చర్యలు

● జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశంలో డీఎంహెచ్ఓ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): ఆడపిల్లల నిష్పత్తి తగ్గకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆన్‌లైన్‌లో స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్ కోసం వచ్చిన దరఖాస్తులను కమిటీ ఆమోదం కోసం ప్రవేశ పెట్టారు. వీటిని జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సభ్యులు పరిశీలించి అనంతరం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే జిల్లా స్థాయి మల్టీమెంటర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ ఆమోదం కోసం పంపించారు. స్కానింగ్ సెంటర్స్‌పై సాధారణ తనిఖీలతో పాటు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని తీర్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామగిడ్డయ్య మాట్లాడుతూ ఆడపిల్లల ప్రాముఖ్యత, సరైన వివాహ వయస్సుపై అవగాహన కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్‌జీఓల సహాయంతో ఆడపిల్లల నిష్పత్తి తక్కువగా ఉన్న మండలాల్లోనూ, డిగ్రీ, ఇంటర్, నర్సింగ్ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, గైనకాలజి హెచ్‌ఓడీ డాక్టర్ శ్రీలక్ష్మి, పీడియాట్రిక్స్ హెచ్‌ఓడీ డాక్టర్ విజయానందబాబు, రేడియాలజి హెచ్‌ఓడీ డాక్టర్ రాధారాణి, డెమో ప్రమీలాదేవి, డీపీఆర్‌ఓ శివకుమార్, ఎన్‌జీవో ప్రతినిధులు కె. శ్రీనివాసులు, ఎం. నాగరాజు, ఎస్‌ఓ హేమసుందరం, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్‌ఈ పద్మావతి, ప్రోగ్రామ్ కన్సల్టెంట్ సుమలత పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే అభివృద్ధి సాధ్యం



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్

● గిరిజన శంఖారావం వాల్ పోస్టర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు సిటీ: ఐకమత్యంతోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యమని కోడుమూరు ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్ అన్నారు. శనివారం స్టాంటన్ పురంలోని వైఎస్‌ఆర్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో గిరిజన శంఖరావం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అణగారిన ఎస్సీ, ఎస్టీల కోసం అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను వెనువెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. వచ్చే నెల 7వ తేదీన విజయవాడలోని తుమ్మల పల్లి క్షేత్రంలో జరిగే గిరిజన శంఖారావానికి పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో గూడూరు, సి.బెళగల్, కర్నూలు జెడ్పీటీసీలు మౌలాలి, గిరిజోన్, ప్రసన్నకుమార్, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ మహబూబ్ బాషా, బంజార ధర్మసేన రాష్ట్ర అధ్యక్షుడు రాజా రాం నాయక్, జీపీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రవి నాయక్, జిల్లా అధ్యక్షుడు జయరాం నాయక్, గుడుంబ తండా శీను నాయక్, ఆనంద్, విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా పోషకాహారమివ్వాలి



పోషకాహారం గురించి వివరిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): గర్భిణీలు, పిల్లలకు రెగ్యులర్‌గా పోషకాహారం ఇవ్వాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శనివారం ఆయన నగర శివారులోని వెంగన్నబావి గ్రామంలో జరుగుతున్న మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పకుండా ఇవ్వాలని తెలిపారు. వారి వివరాలను ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్, యూవిన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ముఖ్యంగా ఐరన్ అందించే ఆహారమైన నువ్వులు, బెల్లం, రెడ్ కిడ్నీ బీన్స్, పచ్చని ఆకుకూరలు, కూరగాయలు, డ్రైఫ్రూట్స్, గింజ ధాన్యాలు అందరూ తిని ఆరోగ్యంగా ఉండాలన్నారు. గర్భిణిగా ఉన్న సమయంలో క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, అలాగే 10 నుంచి 12 కిలోల బరువు పెరగాలన్నారు. అనంతరం ఎత్తు, బరువు తక్కువ ఉన్న పిల్లలకు ఐఎఫ్‌ఏ, విటమిన్–ఎ సిరప్‌లను పంపిణీ చేశారు. సాన్స్ కార్యక్రమంలో భాగంగా శ్వాసకోశ వ్యాధులు, జలుబు, దగ్గు, ఆయాసం కారణాలు ఉన్న పిల్లలను సర్వే చేసి అలాంటి లక్షణాలున్న వారి వివరాలను ఏఎన్‌ఎం యాప్‌లో నమోదు చేయాలన్నారు. వారికి మెడికల్ ఆఫీసర్ చికిత్స అందించి నయం చేస్తారన్నారు. కార్యక్రమంలో డీసీఎం ప్రసాద్, ఎంపీహెచ్ఎస్ ప్రభాకర్‌రెడ్డి, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాలు పాల్గొన్నారు.

గ్రూపు 1,2 పోస్టుల సంఖ్యను పెంచాలి

కర్నూలు(సెంట్రల్): గ్రూపు 1,2 పోస్టుల సంఖ్యను పెంచి మళ్లీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి డిమాండ్ చేశా రు. శనివారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ..గ్రూపు అభ్యర్థుల వయో పరిమితిని 42 నుంచి 44 ఏళ్లకు పెంచాలన్నారు. 25 వేల పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ విడుదల చేయాలన్నారు. లేదంటే నిరుద్యోగులను కూడగట్టుకొని పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల దీక్ష

కర్నూలు(సెంట్రల్) : డిమాండ్ల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేపట్టిన దీక్ష ఐదో రోజు కు చేరింది. శనివారం దీక్షను అంగన్‌వాడీ సంఘాల జిల్లా గౌరవాధ్యక్షురాలు పి.నిర్మల, జనసేన పార్టీ నాయకులు సురేష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు ప్రారంభించారు. అనంతరం అంగన్‌వాడీలు శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు వినూత్నంగా భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు.

బాలుడి మూత్రనాళంలో 9 సెం.మీ రాయి

● ఆరోగ్యశ్రీ కింద శస్త్రచికిత్స చేసి తొలగించిన వైద్యులు



బాలుడి మూత్రనాళం నుంచి వైద్యులు తొలగించిన రాయి

కర్నూలు(హాస్పిటల్): సాధారణంగా చిన్నపిల్లలకు మూత్రనాళంలో రాళ్లు ఏర్పడటం అరుదు. అయితే, జిల్లాకు చెందిన ఆరేళ్ల బాలుడు రోహిత్ కుమార్‌కు ఏకంగా 9 సెం.మీ పరిమాణంలో రాయి ఏర్పడింది. దీంతో ఇటీవల తీవ్రమైన జ్వరంతో పాటు మూత్రంలో రక్తం రావడంతో ఈ నెల2వతేది తల్లిదండ్రులు కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. అల్ట్రాసౌండ్, సీటీ స్కానింగ్ చేస్తే మూత్రనాళంలో పెద్దరాయి ఉండటంతో వాపు వచ్చినట్లు తేలింది. బాబు వయసు తక్కువ కావడం, ఇన్‌ఫెక్షన్ ఉండటంతో ముందుగా ఒక స్టెంట్ అమర్చి, రెండు వారాల తర్వాత శస్త్రచికిత్స చేసి ఒకేసారి 9 సెం.మీ రాయిని తొలగించినట్లు యురాలజిస్ట్, ఆండ్రాలజిస్టు డాక్టర్ వై. మనోజ్‌కుమార్ శనివారం తెలిపారు. ఇంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సను మొత్తం ఆరోగ్యశ్రీ పథకంలో పూర్తి ఉచితంగా చేసినట్లు వెల్లడించారు.

24న కురువల సింహగర్జన



అభివాదం చేస్తున్న కురువ సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): ఈ నెల 24వ తేదీన ఆలూరులో నిర్వహించనున్న మదాసి/ మదారి కురువ, కురువ మహా సింహగర్జనకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో కురువలు హాజరై విజయవంతం చేయాలని జిల్లా కురువ సంఘం నేతలు పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం స్థానిక బీ క్యాంప్‌లోని బీసీ భవన్‌లో జరిగిన కార్యక్రమానికి సంఘం నేతలు డా.లక్ష్మీప్రసాద్, పంచలింగాల నాగరాజు, కె. రామకృష్ణ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జిల్లాలో అధిక జనాభా ఉన్న కురువలకు ఒక పార్లమెంట్, రెండు ఎమ్మెల్యే స్థానాలను కేటాయించి రాజకీయ ప్రాధాన్యత కల్పించాలన్నారు. దశాబ్దాలుగా అన్ని రాజకీయ పార్టీలు కురువలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పరమేష్, విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర కార్యదర్శి ఎల్లప్ప, నాయకులు వెంకటరాముడు, మద్దిలేటి, బండారు శ్రీనివాసులు, యువజన విభాగం వ్యవస్థాపక అధ్యక్షుడు మహానంది, వెంకటేష్, సురేష్, మల్లికార్జున, సురేంద్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మైపర్‌లో సైంటిఫిక్ సెషన్

కర్నూలు సిటీ: మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో శనివారం సైంటిఫిక్ సెషన్‌ను నిర్వహించారు. ఆ కాలేజీ అకడమిక్ డైరెక్టర్ డా.ఆదిమూలపు సతీష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సైంటిఫిక్ సెషన్ ఫార్మసీ విద్యార్థుల్లో నైపుణ్యత పెంచేందుకు ఉపయోగపడుతుందన్నారు. అనంతరం వివిధ విభాగాలకు సంబంధించిన అంశాలపై విద్యార్థులు పోస్టర్ ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ స్టెల్లా సతీష్, ప్రిన్సిపాల్ రవి కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకనం నిధుల మాయంపై విచారణ చేపట్టాలి



కలెక్టరేట ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

కర్నూలు(సెంట్రల్): గతేడాది పదో తరగతి పరీక్షల మూల్యాంకనం కోసం విడుదల చేసిన రూ.70 లక్షలను విద్యాశాఖ అధికారులు దిగమింగారని, దీనిపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు డి.రామశేషయ్య డిమాండ్ చేశారు. నిధుల మాయంపై డీఈఓను బాధ్యుడిని చేసి ఆయనను విధుల నుంచి తప్పించాలని కోరారు. శనివారం సాయంత్రం ఆ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం మూల్యాంకనం కోసం రూ.70 లక్షలు కేటాయించిందన్నారు. ఇందులో మూల్యంకన విధులకు హాజరైన ఉపాధ్యాయులకు ఒక్కొక్కరికి రూ.6 వేలు రావాల్సి ఉందన్నారు. అయితే, రూ.1500–2000 మాత్రమే ఇచ్చారన్నారు. మిగిలిన డబ్బులను డీఈఓ, పరీక్షల ఏసీ, మరికొంత మంది సిబ్బంది కలిసి స్వాహా చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, నందీశ్వరుడు పాల్గొన్నారు.

అమడగుంట్ల హైస్కూల్‌కు రూ.లక్షన్నర విరాళం



మాట్లాడుతున్న సీనియర్ నాయకుడు అమడగుంట్ల క్రిష్టారెడ్డి

కోడుమూరు రూరల్: మండలంలోని అమడగుంట్ల హైస్కూల్ తరగతి గదులకు సపోర్టు వాల్ నిర్మాణం, బీసీ బాలుర హాస్టల్ విద్యార్థులకు తాగు నీటి వసతి కోసం వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అమడగుంట్ల క్రిష్టారెడ్డి, గ్రామవాసి అశోక్‌కుమార్‌రెడ్డి రూ.లక్షన్నర విరాళంగా హెచ్‌ఎం అనంతయ్యకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో క్రిష్టారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దుతోందన్నారు. ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువులు చదవాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, విద్యా వసతి తదితర పథకాలను అమలు చేస్తున్నారని, విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు చదువుకోవాలని క్రిష్టారెడ్డి ఆకాంక్షించారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ షేక్ బాబ్జీ మృతికి సంతాపం

కర్నూలు(సెంట్రల్) : పీడీఎఫ్ ఎమ్మెల్సీ షేక్ బాబ్జీ మృతికి అవాజ్ అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్ హుస్సేన్,షేక్ మహ్మద్ షరీఫ్ శనివారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన మృతి మైనార్టీ వర్గాల ప్రజలకు తీరని లోటని, శాసనమండలిలో ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై బాబ్జీ నిరంతరం పోరాటాలు చేశారని కొనియాడారు.

దివ్యాంగులకు పరికరాలు అందిస్తాం



దివ్యాంగుల వివరాలు నమోదు చేసుకుంటున్న అధికారులు

మద్దికెర: ఉమ్మడి జిల్లాలో రూ.2.69 కోట్ల విలువ చేసే మూడు చక్రాల వాహనాలు, ల్యాప్‌టాప్‌లు, శ్రవణ యంత్రాలతో పాటు వివిధ పరికరాలను 1,132 మంది దివ్యాంగులకు అందించామని ఉమ్మడి కర్నూలు జిల్లాల దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రైజ్ ఫాతిమా తెలిపారు. శనివారం మద్దికెర ఎంపీడీఓ కార్యాలయంలో ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాం పథకం కింద ప్రతిభావంతులకు, సీనియర్ సిటిజన్లకు సహాయ పరికరాలు అందించేందుకు అర్హులను గుర్తించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగులకు పరీక్షలు చేసి అర్హులైన వారికి నీతి ఆయోగ్ ద్వారా జనవరిలో పరికరాలు అందిస్తామన్నారు. సదరం సర్టిఫికెట్ల జారీకి వివరాలు నమోదు చేసుకున్నామన్నారు.

వేధింపుల నుంచి రక్షణ కల్పించండి

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వెంకటరమణ కాలనీలోని కరూర్ వైశ్యాబ్యాంకు అధికారుల నుంచి వేధింపులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, వెంటనే తగిన చర్యలు తీసుకుని కాపాడాలని క్లర్క్ కమ్ క్యాషియర్ మాణిక్యరావు తెలిపారు. నంద్యాల పట్టణానికి చెందిన తనను బ్రాంచి మేనేజర్, బ్యాంకు ఆఫీసర్, ఏజీఎంలు కుమ్మక్కై వేధింపులకు గురి చేయడమే పనిగా పెట్టుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఏ తప్పు చేయకపోయినా... కులంపేరుతో దూషిస్తున్నారని పేర్కొన్నారు. తనకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు కూడా ఇవ్వడం లేదన్నారు. వారిపై పోలీసులకు పిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి మేనేజర్, బ్యాంకు అధికారి, ఏజీఎంలు సాగిస్తున్న అక్రమాలు, వేధింపులపై సమగ్రంగా విచారణ జరిపించాలని కోరారు.

నేటి నుంచి ధనుర్మాస దీక్షలు

కర్నూలు(సెంట్రల్) : గోదాగోకులంలో ధనుర్మాస దీక్షలు ఆదివారం ఉదయం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మారంనాగరాజు గుప్తా తెలిపారు. శనివారం గోదా గోకులంలో దీక్షలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

నేడు రాజ్యాంగ పరిరక్షణపై సమావేశం

కర్నూలు(అర్బన్): ప్రమాదంలో రాజ్యాంగం.. రాజ్యాంగాన్ని కాపాడుకోవడంలో మహిళల బాధ్యత అనే అంశంపై ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు.

రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీల్లో ప్రతిభ

గడివేముల: ఇటీవల నంద్యాల మెయిన్ మునిసిపల్ పాఠశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి త్రోబాల్ ఎంపిక పోటీల్లో మండల పరిధిలోని కరిమద్దెల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు పాల్గొని సత్తాచాటారు. అండర్–14 విభాగంలో మంజూషా, నాగచైతన్య, అండర్–17 విభాగంలో సాయి ప్రసన్న, పవన్‌తేజ, మౌనిక రాణించారు. ఇందులో మంజూషా, సాయిప్రసన్న ఆయా విభాగాల్లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని శనివారం పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బాలవెంకటేశ్వర్లు, సర్పంచ్ సుంకన్న, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ పుల్లయ్య, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

